క్లుప్తంగా

జాబ్‌కార్డు వినియోగించుకోండి



తిమ్మాపూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీఓ జయదేవ్‌ఆర్య

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ జయదేవ్‌ఆర్య అన్నారు. గురువారం మండలంలోని రాయవరం, తిమ్మాపూర్ గ్రామాల్లో ఉపాధి పనులు, నర్సరీలను, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒకరూ పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఎండల తీవ్రత ఉన్నందున కూలీలు వడదెబ్బ తగలకుండా ఉదయం, సాయంత్రం పనులను చేసుకోవాలని సూచించారు. ప్రతీ రోజూ కూలీలు ఓఆర్‌ఎస్ కలిపిన నీళ్లను తీసుకోవాలన్నారు. తాగునీటి వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ శ్రీనివాస్‌వర్మ, ఎఫ్‌ఏలు యాదగిరి, గౌస్, సీసీలు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాయపోలు(దుబ్బాక): మండలంలోని రాంసాగర్‌లో శ్రీసీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో రెండు రోజులుగా వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భద్రాచలం సీతారాముల కల్యాణంలో వినియోగించిన తలంబ్రాలతో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. సీతారాముల కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

చేర్యాల(సిద్దిపేట): బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు రాజయ్య పిలుపునిచ్చారు. గురువారం కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి మీస సత్యనారాయణతో కలిసి మండల పరిధిలోని గుర్జకుంటలో జరిగిన కురుమ కుల స్తుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. కురుమలు రాజకీయంగా వెనుకబడిన నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ గుర్తించి మల్లేష్‌కు భువనగిరి ఎంపీ టికెట్ ఇచ్చాడన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మీస పార్వతి, నాయకులు సత్తయ్య, కనకయ్య, మల్లేశం, అయ్యాలం, రాజయ్య, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

హుస్నాబాద్ రూరల్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి అన్నారు. గురువారం పోతారం (ఎస్)లో ఏర్పాటు చేసిన కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె క్రీడ కబడ్డీ అంతరించిపోతున్న క్రమంలో ప్రొకబడ్డీతో మళ్లీ ఆదరణ పెరుగుతోందన్నారు. హుస్నాబాద్ యువతకు కృష్ణ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు తీసుకుపోవడం అభినందనీయమన్నారు. కార్య క్రమంలో కబడ్డీ కోచ్ మడక కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా తల్లిదండ్రుల పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

సిద్దిపేట జోన్: సిద్దిపేట వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఓ ప్రైవేటు గార్డెన్‌లో తల్లిదండ్రుల పాద పూజ నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య పిల్లలు తమ తల్లిదండ్రుల పాదాలకు పూజ చేశారు. బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర సారథి ప్రసాద్ సొసైటీ చైర్మన్ అరవింద్, అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, యోగా శిక్షకులు సతీష్, సంధ్య, ప్రతినిధులు అశోక్, అంజయ్య పాల్గొన్నారు

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

గజ్వేల్‌రూరల్: మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, ఎంఎస్‌పీ నాయకుడు మైస రాములుమాదిగలు పిలుపు ఇచ్చారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ మాదిగలకు ఒక్క ఎంపీ సీటు ఇవ్వకుండా అవమానించిందన్నారు.

పదిలో 'మోడల్' ప్రతిభ

- విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన
- వారాంత పరీక్షలతో మెలకువలు
- వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాల



మిరుదొడ్డిలోని తెలంగాణ మోడల్ స్కూల్

విద్యార్థికి చదువు కంటే ముందు క్రమశిక్షణ అవసరం అది ఉంటే విద్యలో ఉన్నతంగా రాణించవచ్చని గ్రహించిన ఉపాధ్యాయులు తొలి నుంచి మంచి క్రమశిక్షణ అలవాటు చేశారు. చెప్పిన పాఠాలు విద్యార్థులు శ్రద్ధగా వినేలా చేశారు. వీక్లీ టెస్టులతో పరీక్షలపై భయం పోగొట్టారు. దీంతో అనుకున్న లక్ష్యం సాధించారు. పది ఫలితాల్లో జిల్లాలో రోల్ మోడల్‌గా నిలిచారు.

మిరుదొడ్డి(దుబ్బాక): క్రమశిక్షణ కలిగిన విద్యార్థుల కృషికి అంకిత భావం కలిగిన ఉపాధ్యాయుల బోధన తోడైతే అసాధ్యాన్ని సుసాధ్యం చేయొచ్చని నిరూపించారు మిరుదొడ్డిలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు. నిరుపేద విద్యార్థులను తీర్చి దిద్దటంలో ఉపాధ్యాయులు చేసిన కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఫలించింది. పట్టుదలతో చదివి పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో శభాష్ అనిపించుకున్నారు. పాఠశాలలో పది చదివిన డోకి చందన 10 జీపీఏ, ఎం. సాయి శృతి 10 జీపీఏ సాధించి సత్తా చాటారు. పాఠశాలలో 90 మంది ఉత్తీర్ణులై వంద శాతం ఫలితాన్ని సాధించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడానికి ఉపాధ్యాయులు దోహదపడ్డారు. అత్యాధునికమైన పాఠశాల, విశాలమైన తరగతి గదులు, మంచి వాతావరణం కలిగిన పాఠశాల కావడంతో విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకున్నారు. చదువులో వెనుకబడ్డ టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతుల నిర్వహించారు. విద్యార్థులను మరింత క్రమశిక్షణకు అలవాటు పడటానికి తల్లిదండ్రుల సలహాలు తీసుకున్నారు. వారానికి ఒకసారి స్లిప్ టెస్టులు, మూడు నెలలకు ఒకసారి మోడల్ పరీక్షలపై అవగాహన కలిగించడంలో ఉపాధ్యాయులు చేసిన ప్రయోగం మంచి ఫలితాన్ని ఇచ్చింది. మంచి క్రమశిక్షణతో ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ఎప్పటికప్పుడు శ్రద్ధతో చదివి పది పరీక్షలు రాశారు. నూటికి నూరు శాతం ఫలితాలు సాధించి జిల్లాలోనే మంచి జీపీఏ సాధించి మేటిగా నిలిచారు.

శ్రద్ధగా చదివాను



ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు శ్రద్ధగా చదివాను. మా టీచర్లు చాలా చక్కగా బోధించేవారు. పాఠాలు సులభంగా అర్థమయ్యేవి. మా తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడైంది. మా ప్రతిభను వెలికి తీయడానికి ప్రత్యేక తరగతులు ఉపయోగపడ్డాయి. పది పరీక్షలంటే భయం లేకుండా ఉపాధ్యాయులు ఇచ్చిన ధైరంతోనే పరీక్షలు రాశాను. మంచి ఫలితం సాధించా.

– డోకి చందన, 10 జీపీఏ

సంతోషంగా ఉంది



పది ఫలితాలల్లో 9 జీపీఏ సాధించడం సంతోషంగా ఉంది. టీచర్లు బోధించిన తీరు ఎంతో దోహదం చేసింది. వారానికి ఒకసారి స్లిప్ టెస్టులు, టెన్త్ మోడల్ పరీక్షలపై అవగాహన పెంచింది. ఆ ఉత్సాహంతోనే పది పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాన్ని సాధించాను. మంచి మార్కులు రావడం చాలా సంతోషంగా ఉంది.

– ఎం. సాయి శృతి, 10 జీపీఏ

అందరి శ్రమ ఫలించింది



తల్లిదండ్రుల ప్రోత్సాహానికి తోడు అంకిత భావం కలిగిన తోటి ఉపాధ్యాయులు పడ్డ శ్రమ ఫలించింది. మంచి క్రమశిక్షణను అలవర్చుకున్న విద్యార్థులు ఇష్టంతో చదివారు. వెనుక బడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా, మోడల్ టెస్ట్ పేపర్లతో అవగాహన కలిగించాం. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేశారు. విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.

– భారతీ దేవి, ప్రిన్సిపాల్, మిరుదొడ్డి

ఆ పార్టీలను నమ్మొద్దు



రాజక్కపేటలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

దుబ్బాక: బీజేపీ, కాంగ్రెస్‌లను ప్రజలు నమ్మొద్దని, మరోసారి ఆ పార్టీల నాయకులు మాయమాటలతో మోసం చేసేందుకు వస్తున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని రేకులకుంట మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేసి బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మండలంలోని రాజక్కపేట గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. మల్లన్నసాగర్‌ను నిర్మించి కేసీఆర్ సాగు నీరందించారన్నారు. వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం చాలా అభివృద్ధి చెందుతుందన్నారు.

అందె గ్రామంలో ..

మిరుదొడ్డి(దుబ్బాక): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు మండల పరిధి అందె గ్రామంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు సూకూరి లింగం, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మాజీ సర్పంచ్ జోగ్గారి బాల్ నర్సింహులు, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు వల్లాల సత్యనారాయణ, నంట బాపురెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చందాపురం మల్లేశం, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, పర్శరాములు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి జరిగిందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కుకునూర్‌పల్లి మండలంలోని చిన్నకిష్టాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్‌ను కేసీఆర్ నంబర్ వన్‌గా అభివృద్ధి చేశారన్నారు. బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనకయ్య, కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ లక్ష్మణ్‌రాజ్, నాయకులు దుర్గారెడ్డి, సంతోష్, చంద్రం, రాజు, కనకయ్య, వెంకట్‌గౌడ్, గణేష్, చారి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలుపు ఖాయం

తొగుట(దుబ్బాక): బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి, చందాపూర్, జప్తిలింగారెడ్డిపల్లి, తొగుటలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

ఇంటింటి ప్రచారంలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చెలుకలపల్లి, ఎల్లాయపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్‌రామిరెడ్డికి మద్దతుగా గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జంగిటి శ్రీనివాస్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు.

కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో..

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ, రవీంద్రనగర్, కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వెంకట్రామిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటరులకు విజ్ఞప్తి చేశారు.

గరుడ ప్రసాద వితరణ



గరుడ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట –భూంపల్లి మండల పరిధిలోని మోతెలో పద్మావతి సమేత వేంకటేశ్వరాలయంలో ఆలయ అర్చకుడు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో 'సాక్షి' సర్క్యులేషన్ మేనేజర్ ఆంజనేయులు (హైదరాబాద్) నేతృత్వంలో గురువారం గరుడ పూజ నిర్వహించారు. ఉత్సవ సుప్రభాతం, అభిషేకాలు, సంతాన నాగదేవతకు 108 లీటర్ల పాలతో కలశాభిషేకం, మంగళ స్నానాలు, లక్ష పుష్పాలతో సరస్వతీ దేవతకు అర్చన, సహస్ర దీపాలంకరణ, సామూహిక హోమం, పూర్ణాహుతి జరిగాయి. హోమంలో పాల్గొన్న భక్తులకు గరుడ తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ల సేకరణ



వడ్డేపల్లిలో పోస్టల్ బ్యాలెట్ సేకరిస్తున్న ఎన్నికల సిబ్బంది

రాయపోలు(దుబ్బాక): పార్లమెంట్ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా గురువారం ఓటుహక్కు వినియోగించుకున్నారు. రాయపోలు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు ఈసీకి చేసుకున్నారు. ఆరుగురు దివ్యాంగులు, 22 మంది వృద్ధులు ఓటు వేయగా, ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ పత్రాలు సేకరించారు.

ఓటువేయ్ సీడీ ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేటరూరల్: లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటువేయ్ పాటను ప్రచారం చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. గురువారం కలెక్టరేట్ లో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) ప్రోగ్రామ్ కార్యకలాపాల్లో భాగంగా గజ్వేల్‌కు చెందిన రాయరావు విశ్వేశ్వర రావు స్వయంగా రచన, స్వర కల్పనలో రూపుదిద్దుకున్న ఓటరు చైతన్య పాట – ఓటు వేయ్ పాట ఆడియో సీడీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి జయదేవ్ ఆర్యా, జిల్లా మాస్టర్ ట్రైనర్ అయోధ్య రెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



హుస్నాబాద్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత కోరారు. గురువారం పట్టణంలోని 6వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెలు, పట్టణాలు అభివృద్ధి సాధించాలంటే బీఆర్‌ఎస్ పార్టీ తోనే సాధ్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినోద్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రచార కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు నళినీదేవి, పెరుక భాగ్యరెడ్డి, హరీష్, గోవిందు రవి, కో ఆప్షన్ సభ్యుడు అయూబ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమం పట్టని కాంగ్రెస్, బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. గురువారం బెజ్జంకితో పాటు మండలంలోని గుగ్గిల్ల, కల్లేపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. అభివృద్ధి పనులకు కేంద్రంతో కొట్లాడి నిధులు తెచ్చే వినోద్‌కుమార్‌నే గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఓట్లు బీజేపీకే

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్



రామునిపట్లలో ఎమ్మార్పీఎస్ నాయకుల ప్రచారం

చిన్నకోడూరు(సిద్దిపేట): మాదిగల ఓట్లన్నీ బీజేపీకే వేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామునిపట్ల, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మోదీతోనే సుపరిపాలన

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్, కాన్గల్ గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీతోనే దేశంలో సుపరిపాలన సాధ్యమన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దన్నారు. రఘునందన్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పలుగ్రామాల్లో నాయకుల ప్రచారం

వర్గల్(గజ్వేల్): మండలంలోని అంబర్‌పేట, శాకారం గ్రామాల్లో గురువారం బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో శ్రీరామ్ శ్రీకాంత్, పంపరి రమేష్, ప్రదీప్‌గౌడ్, బబ్బూరి రవీందర్‌గౌడ్, నాగరాజు, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాంగ్రెస్‌కు ఓటేస్తే రాహుల్ గాంధీ పీఎం కాలేదని, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే కేసీఆర్ సీఎం కాలేదని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని చాట్లపల్లి నుంచి జగదేవ్‌పూర్ వరకు రోడ్ షో నిర్వహించారు. జగదేవ్‌పూర్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. సీఎం రేవంత్ అబద్ధాలను ప్రచారం చేస్తూ లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

కొండపాక(గజ్వేల్): రిజర్వేషన్ల విషయంలో బీజేపీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తూ ఎన్నికల్లో ఓట్లు దండుకునేలా చూస్తోందని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలంలోని చిన్న కిష్టాపూర్, బొబ్బాయిపల్లి గ్రామాల్లో గురువారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

తొలిసారి భద్రాచలం ముత్యాల తలంబ్రాలు



తలంబ్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: సీతారామ–ఉమామహేశ్వరుల కల్యాణోత్సవానికి తొలిసారి భద్రాచల ముత్యాల తలంబ్రాలు అందాయి. గజ్వేల్ పట్టణంలోని సీతారామ–ఉమామహేశ్వరుల కల్యాణం గురువారం జరిగింది. గోటి తలంబ్రాలు భద్రాచల సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించగా, మళ్లీ అక్కడి నుంచి గజ్వేల్‌కు చేరాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ భద్రాచల సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించిన ముత్యాల తలంబ్రాలు గజ్వేల్‌కు రావడం సంతోషకరమన్నారు. రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ద్వారా భద్రాచల దేవస్థానం గజ్వేల్‌లో జరిగే సీతారామ–ఉమామహేశ్వరుల కల్యాణోత్సవానికి ముత్యాల తలంబ్రాలు అందించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, రామకోటి రామరాజు భద్రాచల ముత్యాల తలంబ్రాలను దేవాలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు, మఠం శివకుమార్, చాడ నందబాలశర్మకు రామాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కల్యాణం

శ్రీసీతారామ–ఉమామహేశ్వరాలయ ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీసీతారామ–ఉమామహేశ్వర కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఏప్రిల్ 30 నుంచి మే 5వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు, భక్తులు కల్యాణం తిలకించారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత వాలీబాల్ శిక్షణ ప్రారంభం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఉచిత వాలీబాల్ శిక్షణను హెచ్‌ఎం సత్యవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారులకు పీఈటీ ఉప్పలయ్య వాలీబాల్ క్రీడలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ మోదీ నేతృత్వంలో దేశం పురోగతి

హుస్నాబాద్: పట్టణంలోని 1 వార్డు కేబీ కాలనీ, నేతాజీ నగర్, డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద గురువారం బీజేపీ నాయకులు గడప గడప ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఎన్నికల ఇన్‌చార్జి కస్తూరి భూంరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ని రెండోసారి గెలిపించాలని కోరారు. దేశ రక్షణ, ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రపంచ దేశాలకు దీటుగా మోదీ నేతృత్వంలో భారత్ పురోగమిస్తోందన్నారు. మూడోసారి నరేంద్ర మోదీకి మద్దతు ఇచ్చి బండి సంజయ్‌ని పార్లమెంట్‌కు పంపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తోట స్వరూప, నాయకులు బత్తుల శంకర్ బాబు, చిట్టి గోపాల్ రెడ్డి, విద్యాసాగర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరిక

నంగునూరు(సిద్దిపేట): గట్లమల్యాల, కోనాయిపల్లి మాజీ సర్పంచ్‌లు, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడితోపాటు పలువురు బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మైనంపల్లి హన్మంతారావును కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరామని చెప్పారు. గురువారం మాజీ సర్పంచ్‌లు తప్పని రమేశ్, వెంకటేశం, రవీంద్రాచారి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిల్లి నారాయణ విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. వారి వెంట రేకులపల్లి భాస్కరెడ్డి, వెంకటయ్య, కొండల్‌రెడ్డి, రాములు, కిష్టయ్యగౌడ్, నారాయణ, కనుకయ్య ఉన్నారు.

◆ స్నేహితుడి కుటుంబానికి చేయూత

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన కట్ట శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కోహెడ హైస్కూల్‌లో చదువుకున్న మిత్రులు మృతుడి తల్లికి రూ.13,700 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం వెంకటేశం, ముంజ సదానందం, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ పార్టీ మద్దూరు మండల ప్రధాన కార్యదర్శిగా మర్మాముల గ్రామానికి చెందిన ఊట్ల శ్రీధర్‌రెడ్డిని నియమించిన్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శితో పాటు మండల కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యక్షులుగా ముత్యాల మనోహర్, ఈశ్రి రాజిరెడ్డి, కార్యదర్శిగా జీడికంటి సురేష్, బూర్గు శంకర్‌గౌడ్, కోశాధికారిగా దొంతి రాజిరెడ్డి, అధికార ప్రతినిధిగా మఠం భద్రయ్యను నియమించినట్లు తెలిపారు. అనంతరం ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మేక మల్లేశంకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ ఓటరు స్లిప్పుల పంపిణీ

వర్గల్(గజ్వేల్): ఈనెల 13వ తేదీన లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో బూత్ లెవెల్ అధికారులు ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గౌరారం, సామలపల్లి తదితర గ్రామాల్లో పంపిణీ కార్యక్రమాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ పర్యవేక్షించారు. బీఎల్‌ఓలు ఇంటింటికి ఓటర్ల పోలింగ్ స్లిప్పులు అందజేస్తారని, ప్రతీ ఓటరు తప్పనిసరిగా తన ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.



సామలపల్లిలో ఓటరు స్లిప్పుల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్‌ఐ నాగరాజు